నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, శుక్రవారం 30 మే 2025 SANGAREDDY




సంగారెడ్డిలో పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు ప్రభాకర్, మానిక్‌రావు


సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం కొల్లూరులో విత్తనాలు విత్తుతున్న మహిళలు

## మాట తప్పడు..మడమ తిప్పడు

- నిరంతర శ్రామికుడు తన్నీరు హరీశ్‌రావు
- పుట్టినరోజును పురస్కరించుకుని పాటల సీడీ ఆవిష్కరణ
- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, మే 29: ''పని ఏదైనా సరే ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబడి మాట తప్పకుండా.. మడమ తిప్పకుండా అమలు చేయడమే ఆయన లక్ష్యం..ప్రజా క్షేత్రంలో నిరంతర శ్రామికుడిగా సేవలందించే గొప్ప మనసు ఉన్న నాయకుడు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు'' అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గుర్తుచేశారు. జూన్ 3న హరీశ్‌రావు పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాటల సీడీని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జహీరాబాద్ ఎమ్మెల్యే మానిక్‌రావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు మాట ఇస్తే అమలు చేసే నైజాన్ని పుట్టుకతోనే కొని తెచ్చుకున్న గొప్ప నాయకుడు హరీశ్‌రావు అని కొనియాడారు. అధికారంలో ఉండగా ఏశాఖ పదవి ఇచ్చినా సమర్థవంతంగా తనదైన శైలిలో వన్నె తెచ్చిన నాయకుడిగా కీర్తి ప్రతిష్టలు సంపాదించిన నేతగా ముద్రవేసుకున్నారన్నారు. ప్రభుత్వంలో ఉన్నపుడు కాళేశ్వరం ప్రాజెక్టు పనులు అప్పగిస్తే శక్తి వంచన లేకుండా అప్పటి గవర్నర్ చేత కాళేశ్వర్‌రావు అనే పేరు సంపాదించిన ఘనత హరీశ్‌రావుకే దక్కిందన్నారు. ప్రజలు, నాయకులు వస్తే వెంటనే సమస్యలు తెలుసుకుని నేనున్నానంటూ భరోసా కల్పించి గుండెకు హత్తుకునే నాయకుడు హరీశ్‌రావు అని ఎమ్మెల్యే కితాబిచ్చారు.


సంగారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

### ప్రజా గుండెల్లో నిలిచిన నాయకుడు

మంత్రిగా ఉన్నా లేకున్నా పార్టీ నాయకులు, ప్రజలు తన దగ్గరకు వెళ్తే సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఫోన్‌లో చెప్పే అలవాటు కలిగిన వ్యక్తి హరీశ్‌రావు అని ఎమ్మెల్యే మానిక్‌రావు అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రజలగుండెల్లో గూడు కట్టుకున్న నాయకుడిగా గుర్తింపు సాధించడం గొప్పవిషయమన్నారు. అన్నా అని పిలిచే నాయకుడు హరీశ్‌రావు. .హరీశ్‌రావు అండ కొండంత అండ..ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని పాటల సీడీ ఆవిష్కరణలో భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. పాటల సీడీ ఆవిష్కరణకు కృషి చేసిన స్రవంతి, అరవింద్ రెడ్డిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పాటల సీడీ ఆవిష్కరణలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యమ్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నాయకులు రాజేందర్, శివరాజ్ పాటిల్, చింత గోపాల్, మందుల వరలక్ష్మి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, బీఆర్‌ఎస్ జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు నారాయణ, వెంకటేశం, సంజీవరెడ్డి, నర్సింహులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# అప్పులే శరణ్యం..!


సంగారెడ్డి జిల్లా ఇరిగిపల్లి గ్రామ శివారులో దుక్కి దున్నుతున్న రైతు

- రైతు భరోసా జాడేది..
- వానకాలం సాగు పనులు షురూ..
- విత్తనాలు,ఎరువుల పెట్టుబడులకు రైతుల వద్ద డబ్బులు లేవు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అరకొరగా రైతు భరోసా
- సగానికిపైగా రైతులకు పంట రుణమాఫీ కాలేదు
- కేసీఆర్ ప్రభుత్వమే నయం.. ఠంచన్‌గా పడిన డబ్బులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్న కర్షకులు

సిద్దిపేట, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రోహిణికార్తెలోనే వర్షాలు పడుతున్నాయి.దీంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్ కిరాయికి డబ్బులు కావాలి, విత్తనాలు, ఎరువులు తెచ్చుకోవడానికి చేతిలో పైసలు లేవు. సాగు చేయడానికి చేతిలో పెట్టుబడి లేక వడ్డీవ్యాపారుల వద్దకు అప్పులకు రైతులు పరుగెత్తుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు తిప్పలు తప్పడం లేదు. సకాలంలో రైతులకు రైతు భరోసా వేయడం లేదు. గత యాసంగి, అంతకు ముందు వానకాలం డబ్బులే పూర్తిగా వేయలేదు. గత యాసంగి డబ్బులు కేవలం రెండున్నర ఎకరాల వరకే వేసి ప్రభుత్వం చేతులు దులుపుకున్నది. ఈ సారి వానకాలంలోనైనా సకాలంలో రైతు భరోసా డబ్బులు వేస్తారా..? అని రైతులు ఆశగా ప్రభుత్వం వైపుచూస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సకాలంలో రైతు బంధు వేయడంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగు పనులు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు తిప్పలు మొదలయ్యాయి. విత్తనం విత్తుకునేనాటి నుంచి పంట చేతికి వచ్చి అమ్ముకునేదాకా తిప్పలే ఉన్నాయి.

### సాగు పనులు షురూ..

వానకాలం సాగు పనులు షురూ అయ్యాయి. రైతులకు రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం క్లారిటీ ఇవ్వలేదు. ప్రభుత్వ అన్ని కోతలు పెడుతున్నది.ఎన్నికల ముందు అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేస్తుంది. ఏడాదిన్నర దాటినా ఇంత వరకు ఇచ్చిన మాట ప్రకారం ఏ ఒక్కటి చేయలేదని రేవంత్‌రెడ్డిపై రైతులు మండిపడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఠంచన్‌గా పంట సాగు కాలం ప్రారంభం కాగానే రైతు బంధు డబ్బులు జమ అయ్యేవి. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమం గురించి పూర్తిగా విస్మరించి అన్ని పథకాలకు కోత పెడుతున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్ధం చేసిన రైతు బంధును మాత్రమే వేసింది. వానకాలంలో రైతులకు వేయాల్సిన రైతు భరోసా ఎగ్గొట్టింది. యాసంగి సాగు పనులు పూర్తి అయి పంట చేతికి వచ్చి ధాన్యం అమ్ముకున్నా ఇంత వరకు రైతు భరోసా దిక్కే లేదు. వానకాలం సాగుకు రైతు భరోసా వస్తదా...? రాదా తెలియదు. గత యాసంగిలో కొంత మందికి రైతు భరోసా కింద ఎకరానికి 6 వేల చొప్పున వేస్తామని చెప్పి, మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని తొలి విడతలో ఎకరానికి రూ. 6 వేల చొప్పున గ్రామంలోని రైతులకు వేశారు. ఆ తర్వాత అందరికీ రెండు ఎకరాల వరకు మూడు విడతల్లో రైతు భరోసా విడుదల చేశారు. మిగిలిన ఏ రైతుకు పూర్తి స్థాయిలో రైతు భరోసా పడలేదు.

### కేసీఆర్ ప్రభుత్వమే నయం

ఎన్నికల ముందు రైతులకు రెండు లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మొండి చేయి చూపింది. ఇక రైతు భరోసా వస్తదా...? రాదా...? తెలియదు. మే 2018 లో కేసీఆర్ రైతు బంధు పథకాన్ని ప్రారంభించి పథకం ప్రారంభంలో ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు ఏడాదికి రూ.8 వేలు ఇచ్చారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ. 5 వేల చొప్పున రెండు పంటలకు ఏడాదికి రూ.10 వేలు అందించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 11వ విడతల్లో 85,99,091 మంది రైతులకు రూ. 8,771.73 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో కేసీఆర్ ప్రభుత్వం జమ చేసింది.సిద్దిపేట జిల్లాలో 29,33,494 మంది రైతులకు రూ. 3,124.82 కోట్లు, మెదక్ జిల్లాలో 24,69,637 మంది రైతులకు రూ.2,027.37 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 31,95,960 మంది రైతులకు రూ.3,619.54 కోట్లు రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో వేసింది. రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించి రైతులకు కేసీఆర్ భరోసా ఇచ్చారు. స్వయంగా రైతు బిడ్డ, రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా రైతుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాటుపడింది. ఈ కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులకు మొండి చేయి చూపుతోంది.

### రైతుభరోసా రాలేదు..



వానకాలం వర్షాలు పడుతున్నాయి. కాలం నెత్తిమీదికొచ్చినా ప్రభుత్వం రైతు భరోసా వేస్తలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో యాసంగి, వానకాలం ముందుగానే రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతు బంధు డబ్బులు పడేది. గీ కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగిలో పంటలు పండించి కాంటా పెట్టినా ఇంత వరకు ఆపంటలకు సంబంధించిన రైతు భరోసా డబ్బులు నేటికీ కొంతమంది రైతులకు ఇంకా అందలేదు. బీఆర్‌ఎస్ పాలనలో మా వంటి ఎంతో మంది రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకున్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

–వెంకటస్వామిగౌడ్, రైతు,నస్కల్, నిజాంపేట మండలం, మెదక్ జిల్లా

### అప్పజేసుడు ఖాయం




గడిచిన పదేండ్లలో రైతులకు ఎలాంటి అవస్థ లేకుండా కేసీఆర్ రైతు బంధు పైసలు వేశాడు. ఆ పైసలతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు దున్నుకాలు, నాట్లు వేసే కూలీలకు ఇచ్చే వాళ్లం. పంట పెట్టుబడికి రైతుబంధు పైసలు ఠంచన్‌గా రావడంతో ఇబ్బంది లేకుండా ఎవుసం చేసుకునేవాళ్లం. వానకాలం వర్షాలు పడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసా పైసలు వేయలేదు. ఎరువులు,విత్తనాలకు అప్పుజేసుడు ఖాయం.కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల పంటపెట్టుబడుల కోసం మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

–తిరుమల్, రైతు,నిజాంపేట మండలం, మెదక్ జిల్లా

## ధాన్యం సేకరణ తీరుపై రైతుల ఆగ్రహం

అల్లాదుర్గం, మే 29 : ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు.మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కు చెందిన రైతులు గురువారం 161వ జాతీయ రహదారిపై గడిపెద్దాపూర్ వద్ద రాస్తారోకో చేపట్టారు.రోడ్డుపై వాహనాలు,ధాన్యం మ్యాచర్ పరికరాన్ని అడ్డంగా పెట్టి అన్నదాతలు ఆందోళన చేపట్టడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో తూకం వేసి ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతున్నదని,దీంతో తా ము ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. పది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ధాన్యం తడిసి పోతున్నదన్నారు. అధికారుల తీరుతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాలతో ధాన్యం తడిసి పోవడం వల్ల, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మ్యాచర్ రాకపోవ డం వల్ల జాప్యం జరుగుతున్నదని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు,అధికారులు అంటున్నారు. రైతులు చేపట్టిన రాస్తారోకో గంట పాటు కొనసాగడంతో విషయాన్ని తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడా రు.రైతుల ఇబ్బందులను సంబంధిత అధికారులకు విన్నవించారు.దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న పౌరసరఫరా శాఖ అధికారులు జగదీశ్‌కుమార్, సురేశ్‌రెడ్డి గడిపెద్దాపూర్ కొనుగోలు కేంద్రంతో పాటు అల్లాదుర్గంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం తరలింపులో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, గడిపెద్దాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో నిలవ ఉన్న ధాన్యాన్ని మూడు రోజుల్లో తరలిస్తామని,అల్లాదుర్గంలో ఉన్న ధాన్యాన్ని వారం రోజుల్లోగా కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. వారి వెంట తహసీల్దార్ మల్లయ్య,ఏపీఎం నాగరాజు ఉన్నారు.


మెదక్ జిల్లా గడిపెద్దాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు


సిద్దిపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, చిత్రంలో అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, అబ్దుల్ హమీద్

## కిసాన్‌మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, మే 29: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జూన్ 4 నుంచి 6 వరకు జరగనున్న కిసాన్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు గురువారం సిద్దపేట ఐడీఓసీలోని సమావేశ మందిరంలో కిసాన్‌మేళా ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నాబాద్ మార్కెట్ కమిటీలో నిర్వహించనున్న కిసాన్‌మేళాలో దాదాపు 130 స్టాళ్ల వరకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి విభాగాన్ని పర్యవేక్షిస్తూ రైతులకు అవగాహన కల్పించడంతో పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులను బృందాలుగా నియమించినట్లు తెలిపారు. స్టాల్ ఏర్పాటుకు ఏదైనా సంస్థ సిబ్బంది హాజరు కావడం లేదని నిర్ధారణ జరిగితే దాని స్థానంలో మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. కిసాన్‌మేళాలో నూతన వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం గురించి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.రైతులకు అవసరమైతే బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చేవారి కోసం భోజనం, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. సిద్దిపేట అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, అబ్దుల్ హమీద్, సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి రాధిక, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

## చినుకు పడితే తిప్పలే


జహీరాబాద్ సమీపంలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- జహీరాబాద్‌లో అసంపూర్తిగా రోడ్డు కంబ్రిడ్జి నిర్మాణం
- వాహనచోదకులకు తప్పని కష్టాలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం

జహీరాబాద్, మే 29 : జహీరాబాద్ పట్టణంలోని అల్గోల్ బైపాస్ వెళ్లే దారిలో వర్షాలు కురిస్తే ప్రయాణం నరకప్రాయంగా మారుతున్నది. ఈ మార్గంలో రోడ్డుతో పాటు బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఈ మార్గంలో వాగు తలపించే మురుగుకాల్వ ప్రవహిస్తున్నది. ప్రతిరోజు జహీరాబాద్ పట్టణంలోని పలు వార్డుల మురుగు ఈ వాగు గుండా ప్రవహిస్తుంది. వర్షాకాలంలో వర్షాలు కురిసినప్పుడు వాగు గుండా ప్రవహించే మురుగు రోడ్డుపైకి చేరి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. ఈ రోడ్డు గుండానే పట్టణ సమీపంలోని భరత్‌నగర్, అల్లానా ఫ్యాక్టరీ, అల్గోల్, పోట్‌పల్లి, ఎల్గోయి తదితర గ్రామాలతో పాటు బీదర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. మూడేండ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.33 లక్షల నిధులు మంజూరు చేసింది.


అల్గోల్ బైపాస్ చౌరస్తాలో బోల్తాపడిన ఆటో

అప్పట్లో టెండర్లు పూర్తికాగానే సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అప్పట్లో వర్షాకాలం ప్రారంభం నాటికి బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ బిల్లులు చెల్లింపులో జ్యాపంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. ఆ తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పురోగతి కరువైంది. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయించారు. బీటీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాల్సింది. తిరిగి వర్షాకాలం రావడంతో ఈ రోడ్డు గుంతలమయంగా మారి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారడంతో పాటు గుంతలతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి అసంపూర్తిగా పనులు పూర్తిచేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

# అన్నదాతకు మద్దతు అంతంతే

- క్వింటాల్ వరికి రూ. 69 పెంపు
- గతేడాది కంటే రూ. 48 తక్కువ
- కేంద్రం మద్దతు ధరలపై అన్నదాతల నిరాశ
- రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సు అమలెక్కడ..
- ఇదేం మద్దతు అంటున్న రైతులు

పటాన్‌చెరు, మే 29 : కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఎరువులు, విత్తనాల పై సబ్సిడీని ఎత్తివేస్తున్నది. మరో వైపు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతున్నది. పంటల సాగు కోసం రైతులు వినియోగించే యంత్రాల అద్దెలు పెరిగిపోతున్నాయి. అన్నదాతలకు ప్రతి ఏడాది పెట్టుబడి ఖర్చులు భారీగా పెరుగుతున్నా కేంద్రం పంటల మద్దతు ధర పెంచడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. కేంద్రం ఈ ఏడాది పంటల మద్దతు ధర ప్రకటించింది. వరికి మద్దతు క్వింటాల్‌కు రూ. 69 పెంచింది. గత ఏడాది వరికి మద్దతు ధర రూ.117 పెంచింది. గత ఏడాది కంటే మద్దతు ధర ఈ ఏడాది రూ.48 తగ్గించింది. పంటల సాగు ఖర్చు పెరిగినా మద్దతు ధర పెంచకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కేంద్రం వరి సహా 14 పంటలకు కనీస మద్దతు ధర పెంచింది. వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలను (ఎంఎస్‌పీ) పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వరి, పప్పుధాన్యాలు, నూనె గింజల పంట ఉత్పత్తులపై 9 శాతం చొప్పున ఎంఎస్‌పీ పెంచినట్లు ప్రకటించింది. పెంచిన మద్దతు ధరలు 2025–26 ఏడాదికి అమల్లో ఉంటాయని ప్రకటించింది.



### రైతు కష్టానికి మద్దతు దక్కేనా..?

ఏటా పెరుగుతున్న సాగు పెట్టుబడులకు అనుగుణంగా కేంద్రం పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అమలు చేస్తుంది. కేంద్రం 2024–25లో వానకాలం వరికి క్వింటాల్‌కు మద్దతు ధర రూ. 117 పెంచి, రూ.2320 చేసింది. ఈ ఏడాది కేంద్రం వరికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.. 69 పెంచి. మద్దతు ధర రూ. 2369 ప్రకటించింది. వరికి రూ.69 పెంచడంతో గత ఏడాది కంటే రూ.48 తక్కువగా ప్రకటించింది. పెట్టుబడి ఖర్చులు పెరిగినా కేంద్రం కనీస మద్దతు ధర పెంచకపోవడం పై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2025–26 వానకాలం సీజన్‌కు మద్దతు ధర వరి ఏ గ్రేడ్ క్వింటాల్‌కు రూ. 2389 చేసింది. పత్తి (మధ్య రకం) రూ. 589 పెంచి, మద్దతు ధర రూ.7710 ప్రకటించింది. పత్తి పొడవు రకానికి రూ. 589 పెంచి రూ.8110 చేసింది. కందులకు రూ. 450 పెంచి రూ. 8000 చేసింది. పెసర్లకు రూ. 86 పెంచి రూ. 8768కు చేసింది. మినుములకు రూ. 400 పెంచి క్వింటాల్‌కు రూ.7800గా ప్రకటించింది. మొక్కజొన్నకు రూ.175 పెంచి రూ.2400 చేసింది. సజ్జలకు రూ. 150 పెంచి రూ.2775 చేసింది. రాగికి రూ. 596 పెంచి రూ.4886 మద్దతు ధర ప్రకటించింది. వేరు శనగకు రూ. 480 పెంచి, రూ. 7263 చేసింది. పొద్దు తిరుగుడుకు రూ. 441 పెంచి రూ.7721 మద్దతు ధర చేసింది. నువ్వులకు రూ. 579 పెంచి రూ.9846 చేసింది. సోయాబీన్‌కు రూ. 436 పెంచి రూ. 5329 మద్దతు ధర ప్రకటించింది.

### బహిరంగ మార్కెట్ ధర కంటే తక్కువగా..

బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర కంటే కేంద్రం మద్దతు ధర తక్కువగా ప్రకటించిందని రైతులు వాపోయారు. పత్తి క్వింటాల్‌కు గత ఏడాది రూ. 8500 వరకు రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. వరి సాధారణ రకం క్వింటాల్‌కు రూ. 2500 వరకు, వరి ఏగ్రేడ్ రూ.2700 , మొక్కజొన్న రూ.3200, కంది రూ. 9950 , మినుములు క్వింటల్‌కు రూ.8000 వరకు రైతులు విక్రయిం చారు. వరి, పత్తి ధాన్యాన్ని వ్యాపారులు ఎక్కువగా రైతుల ఇండ్ల వద్దనే కొనుగోలు చేశారు. కేంద్రం బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరను ప్రకటించలేదు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల వద్ద తేమపేరుతో రైతుల ధాన్యం ఎక్కువ శాతం కొనుగోలు చేయలేదు. పత్తిని సీసీఐ కొనుగోలు చేయకపోతే ప్రైవేట్ వ్యాపారులకు రైతులు అమ్మకాలు చేశారు. రాష్ట్రాల నుంచి అభిప్రాయలు తీసుకొని, పంటల సాగు ఖర్చులు పరిగణలోకి తీసుకొని జాతీయ వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్(సీఏసీపీ) సిఫార్సు చేస్తే కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం ఆనవాయితీగా వస్తుంది, రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుల అంచనాలు వేసి కమిషన్‌కు నివేదించినా అమలు చేయడం లేదు.



## గౌరవెల్లి ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలి

### సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి

అక్కన్నపేట, మే 29: గౌరవెల్లి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులతో కలిసి ఆయన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గౌరవెల్లి ప్రాజెక్టు ఎడమ కాల్వ నిర్మాణ కోసం భూ సేకరణ చేపట్టాలన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడస్తున్నా ఇంతవరకు ప్రాజెక్టు పనులు మొదలుకాలేదన్నారు. 17 ఏండ్లు గడస్తున్నా ప్రాజెక్టు పనులు మాత్రం పూర్తికావడం లేదన్నారు. కుడి, ఎడమ కాల్వల నిర్మాణం, మిగతా పనుల కోసం నిధులు మంజూరైనప్పటికీ క్షేత్ర స్థాయిలో పనులు జరగడం లేదన్నారు. అంతకుముందు రేగొండ, గోవర్ధనగిరి, మల్‌చెర్వుతండా, నర్సింగ్ తండాకు చెందిన పలువురు రైతులు భూ సమస్యలపై చాడ వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, నాయకులు జాగీరు సత్యనారాయణ, ఎడల వనేశ్, జేరిపోతుల జనార్దన్, బొజ్జపురి రాజు పాల్గొన్నారు.


సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద రైతులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి